# జ్ఞానగుప్తయత్నం

శ్రీ సి. వి. హెచ్. సుబ్రహ్మణ్యం

ఆది ప్రభాతసమయం. అప్పుడే చరింప సాగిన పక్షులధ్వని గాఢంగా నిద్రించే యువతీ యువకులను కలతబెట్టసాగింది, రైతులు తమ పశువులనుతోలుకొని పొలానికి పోయేవేళ. కూలీలు తమ పనిని ఆరంభించారు. తూర్పు దిక్కున ఆకాశం ఎఱ్ఱనై చీకట్లను త్రోలివేస్తున్నది. ఆ సమయంలో ఒకవ్యక్తి ఎవరో దీర్ఘాలోచనలో నిమగ్నుడై ఇంటిబైట కూర్చున్నాడు. ఆయన మొలకు చిన్నిగుడ్డ, వంటిమీద ఒకగుడ్డతప్ప ఇంకేమీలేదు. వయస్సు ఎక్కువగానే ఉన్నట్లు కనబడుతుంది రాత్రియంతా నిదురలేమిచే కండ్లెఱ్ఱబడి. నీటిబిందువులను రాలుస్తున్నాయి. మనిషిచూస్తే పిచ్చివాడులా కనబడుచున్నాడు. బుద్ధి ఎటువంటిదో ఎవరికీతెలీదు. మొగంచూస్తే అతడేదో పెద్ద విచారంలో ఉన్నట్లు గ్రాహ్యమౌతుంది. ఆయన పేరు జ్ఞానగుప్త.

ఇంతలో ముగ్గురు యువకులెవరో ఆయన ముందుకువచ్చారు, వారినిచూడగానే జ్ఞానగుప్త విచారం అధికమయింది. వారు ముగ్గురుకూడా బోరున ఏడవడం ఆరంభించారు. జ్ఞానగుప్త ధైర్యంతెచ్చుకొని వారితో అన్నాడు—"ఏడ్చి ప్రయోజనంలేదు. కన్నీరు తుడుచుకోండి. ధైర్యంతో ఉండండి. మనమంతా ఏకమైతే ఏపనినైనా సాఫల్యంగా కొనసాగించగలం. ఐకమత్యమే బలం. మనమందరంపోయి దొరతో మొరబెట్టు ... 'మాతల్లికి సెలవీయండి. ఆమె వృద్ధనే శక్తి మాకుంది. మీ దగ్గర దాసీపని చేస్తుండే మాకన్నతల్లినిచూచి మేమూరుకోలేము. మా కడుపులు తరుక్కుపోతున్నాయి"—ఇందుకు ఆయన ఒప్పుకోకపోతే ఆయనతో ధైర్యంగా అనివేద్దాం—" మా తల్లిని మా కీయకపోతే మాపని మేము సాగిస్తాము లోకము భగవంతుడు సాక్షులుగా."

జ్ఞానగుప్త, మిగిలిన వ్యక్తులు అన్నదమ్ములు. వారి తల్లి 'భవాని' ఆమె కింకా ఇద్దరు పుత్రులుండేవారు. వారు కాలంచేసే ముందు జ్ఞానగుప్త పసివాడు. మిగిలినవాళ్ళు ఇంకా చిన్నవాళ్లు. భవానీ పెద్దకుమారులిద్దరూ వేరుపడే సమయంలో తగాదాలు వచ్చారు. తగాదా పోట్లాటయింది. పోట్లాటలో తమ్ముడు దెబ్బతిని మృతినొందాడు. అన్నగారు తమ్ముణ్ణి జయించడానికని 'పీర్' అనే అయన్ని సహాయంగా తెచ్చుకొన్నాడు.

'పీర్' గారు ఒకపెద్ద వర్తకుడు. ఆ వూళ్ళో ఇంకా వర్తకులున్నారుగాని 'పీర్' వర్తకాన్ని మించిన వర్తకం ఎవరూచేయలేరు ఆయన భవానీ పెద్ద కుమారుడి సహాయంతో తన వర్తకాన్ని ఇంకా ఎక్కువగా సాగించడం ఆరంభించాడు. ఆయనకు ఈయనకు దోస్తీ బాగా కుదిరింది.

దినాలుగడిచాయి. పీర్ కోటీశ్వరుడయ్యాడు. భవాని తన పెద్ద కొడుకునిగూడ కోల్పోయి, విచారమయంలోబడి, అనాథయింది. జ్ఞానగుప్త 7 సంవత్సరాల పసిబాలుడు. తమ్ములు పాపాయిలు.

'పీర్' భవానీని తనవద్దనే ఉంచుకొన్నాడు. తల్లికి వేరే దిక్కులేరు. కొడుకులా చిన్నవాళ్ళు. అట్లాగే 'పీర్' దగ్గరఉంటూ, కొడుకుల్ని చూచుకొంటూ కాలం గడుపుతున్నది.

'పీర్' భవానీకి చూపే నిర్దయ ఇంతింతయని చెప్పలేను. ఆమె పెద్ద కుమారుడి సహాయంవల్లనే తాను కోటీశ్వరుడైనానని గూడ విచారింపక ధన మదంచేత అంధుడై భవానీ తల్లిని తన దాసీగా పనిచేయించుకొంటూవున్నాడు. పైగా ఆమెకు తిండిగూడ సరిగా పెట్టకుండా బానిసకంటె హీనంగా చూస్తున్నాడు. పాపం! భవానీ చేసేదిలేక కన్నీరు తుడుచుకొంటూ, తన కుమారులకు రాబోయే దుస్థితిని తలుచుకొంటూ కుళ్ళికుళ్ళి ఏడుస్తూ. సంతోషం అనేదే లేకుండా దినాలు గడుపుతున్నది.

ఈవిధంగా అంధకారమయంతో అమావాస్యరోజులు అంతరించాయి. జ్ఞానగుప్త పూర్ణిమచంద్రునివలె దినదినాభివృద్ధిజెంది పెద్దవాడైనాడు. పేరుకు తగినట్లుగా జ్ఞానాన్ని అమూల్యంగా సంపాదించాడు. తల్లి దుస్థితిని బాగా గ్రహించాడు ఎట్లాగైనా ఆమె బానిసత్వం పోగొట్టితేనే తనకు, తన సోదరులకు స్వేచ్ఛ, అభ్యుదయము, శాంతి చేకూరుతాయని నిశ్చయించాడు.

భవానీ కడసారి పుత్రునిపేరు 'జీహా'. ఆయనకు, పీర్‌గారికి దోస్తీ బాగా కుదిరింది. అందుకని పీరుగారాయన్ను దగ్గరకుతీశాడు. 'పీర్', 'జీహా'ను ఎంతో అనురాగంతో

చూచినా ఆయన సోదరుల్ని మాత్రం చాల హీనంగా చూచేవాడు. 'జీహా' "చిన్ని నా పొట్టకు శ్రీరామరక్ష" అనేవాడేగాని అన్నగార్ల కష్టాన్ని అసలే ఆలోచించేవాడుగాదు. పీర్ ఎట్లాచెబితే అట్లా గంతులేశేవాడు.

జ్ఞానగుప్తకు ఇదంతా తెలుసు. ఆయన సోదరులందర్నీ తనలో ఐక్యం చేసుకున్నాడుగాని, జీహా మూర్ఖత్వాన్నిజూచి విచారించడంతప్ప మరేమీ చేయలేకపోయాడు. ఎట్లాగయినా 'పీర్' బానిసత్వంలోనుంచి తల్లిని, సోదరులను విముక్తులనుచేసి స్వేచ్ఛగా జీవించాలనే ఆయన పరమావధి. అందుకొరకే తన జీవితాన్నంతటినీ ధారవోశాడు. సదా ఆ విషయాన్నిగురించే దీర్ఘంగా ఆలోచిస్తూవుంటాడు. సోదరులు ఆయన ఆజ్ఞను అనుసరిస్తూఉండేవాళ్ళు—'జీహా' మినహా—

రోజులు గడిచినై. పీర్ దశ కూలేటట్లుంది. జ్ఞానగుప్తచేసే ప్రయత్నం ఆయన జీవితానికి ఆటంకం కల్గిస్తుందని అనుకొన్నాడు. భవానీ బాగా పనిచేస్తుంది, ఆమెను వదిలివేస్తే చాలనష్టం వస్తుందని నిశ్చయించాడు. జ్ఞానగుప్త సోదరుల్ని పెంచేసుకొని 'మాభవానిని మాకీయ'మని అడిగాడు పీర్ నిరాకరించాడు.

అంతమాత్రంతో ఊరుకొంటాడా జ్ఞానగుప్త! "మాతల్లిని వదిలిబెట్టు" అని గట్టిగా అరిచాడు పెద్దగొంతుతో—తమ్ముల్నిగూడ అరవమన్నాడు లోకంలోని పెద్దమనుషులు వినేటట్లు.

పీర్ ఇక లాభం లేదనుకొన్నాడు. ఆయన కొంప కూలేటట్టుంది. పాపభయం గూడ లేకుండా ఘోరమైనపనికి పూనుకొన్నాడు. జ్ఞానగుప్తను, ఆయన సోదరులను బంధించివేసి మూతులు కుట్టించివేశాడు.—'జీహా' మాత్రం పీర్ భుజంమీద చేయివేసి చిరునగవుతో మొగమెత్తాడు.

జ్ఞానగుప్త విచారంతో సోదరులవంకా, భవానివంకాచూస్తూ చేతులు జోడించి భగవంతుడికి నమస్కారం చేశాడు.

# భిక్షువు

గోచిపాతయుగాని గుడిసెగానియు లేని
కాటక రాజ్యాధికారి యితడు

కడుపు కన్నము లేని కగ్గిపోయిన మేను
భిక్షుకమూక కధ్యక్షు డితడు

ఆరోగ్య మెరుగని నిరతమ్ము రోగంపు
మానసీయుల యజమాని యితడు

ఆగర్భ దారిద్ర్య మాస్తిగా ధనికుల
ప్రతినిధియై యొప్పు ప్రభువితండు

అనుచు నెవ్వరో యాతనిని వినుతి సేయ
కవిత నా చిన్ని హృదయంబు కలగిపోయె

శవము లెత్తెను తనువు ముచ్చెమట వోసె
ఏమిసేతును లోలోన కుమిలిపోతి

—యం. [illegible]